భారీ వర్షం.. వరదమయం

మలక్‌పేట్ రైల్వే బ్రిడ్జి కింది నుంచి వరద ప్రవహిస్తుండటంతో నిలిచిపోయిన రాకపోకలు



నీటితో నిండిన కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ ఆవరణ






చంపాపేట చౌరస్తాలో..

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఆయా ప్రాంతాలన్నీ అతలాకుతలం అయ్యాయి. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, కాలడేర, మలక్‌పేట్ రైల్వే బ్రిడ్జి తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీలు చెరువులను తలపించాయి. మలక్‌పేట్, నల్గొండ క్రాస్‌రోడ్డు, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో కాసేపు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. చింతల్‌కుంట, దిల్‌సుఖ్‌నగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో జాతీయ రహదారిపై నీరు భారీగా నిలిచింది. సరూర్‌నగర్ చెరువు లోతట్టు కాలనీలైన గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్, పీఅండ్‌టీ కాలనీలలో రహదారులపై వరద ఉధృతంగా ప్రవహించింది. కమలానగర్ కాలనీలో వరదనీటిలో ఓ బైక్ కొట్టుకొచ్చింది.కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయం ఆవరణ వరదనీటితో నిండిపోయింది.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



మూసారాంబాగ్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరదనీరు





మలక్‌పేట్ రైల్వే బ్రిడ్జి కింద..





బండ్లగూడలో..



దిల్‌సుఖ్‌నగర్‌లో..



సింగరేణి కాలనీలో వాహనదారుల తిప్పలు



ఐఎస్‌సదన్‌లో రహదారులపై భారీగా పారుతున్న వరద



పీఅండ్‌టీ కాలనీలో..



కోదండరాంనగర్ కాలనీలో..

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.17, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.24, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.40, మునగ రూ.23, కందగడ్డ రూ.75, బీట్‌రూట్ రూ.13, కీర రూ.18, బీన్స్ రూ.65,క్యాప్సికమ్ రూ.40.ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రవీణ్ హత్యకు నిరసనగా క్యాండిల్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

మలక్‌పేట: ప్రవీణ్ పగడాల హత్యకు నిరసనగా మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్ వెల్ఫేర్ అసోసియషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కోణార్క్ టవర్స్ మీదుగా మూసారంబాగ్ చౌరస్తాలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అసోయేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రాహం మాట్లాడుతూ.. ప్రవీణ్ కేసులో నిజాలు బయటికి తీసి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ఎదుర్కొవడానికి క్రైస్తవులు ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. ర్యాలీలో రాక్ చర్చి సీనియర్ పాస్టర్ బిషప్ తిమోతి, ఆర్చ్ బిషప్ దయానంద్,రెవరెండ్ శాంత్‌కుమార్, బెజవాడ రవికుమార్, పాల్ కిషోర్ నంద్యాల, సీఏ డానియల్ ఆడమ్స్, ఎలీషా లక్ష్మణ్, సాల్మన్‌రాజ్, డేవిడ్, ఆర్‌కేపీ మధు, ఓయూ గడ్డం బాలరాజ్, ప్రొఫెసర్ నతానీయేల్, అలగోల రమేష్ పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి విరాళం



చెక్కు అందజేస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: కొత్తపేట టెలిఫోన్ కాలనీకి చెందిన చౌటి సాయి కమల్ శ్రీ శ్రావస్ దంపతులు ప్రస్తుతం కెనడాలో ఉంటూ తమ కూతురు వరేణ్య పేరుమీద రూ. 50 వేల చెక్కును గురువారం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి అందజేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి గృహ విద్యార్థుల టెక్స్ బుక్స్, స్టేషనరీ కోసం ఉపయోగిచాలని గృహ అధ్యక్షులు మార్గం రాజేష్‌ను కోరారు.

ప్రమాణ స్వీకారం

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధి సౌభాగ్యపురం కాలనీలోని శ్రీ అలివేలు మంగ పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కార్యవర్గ సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ రమణయ్య, కార్యదర్శి వెంకట్ రెడ్డి, కోశాధికారి రామకృష్ణ మూర్తి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు ఉపేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, సుధాకర్ గుప్తా, కృష్ణమూర్తి, కరుణ, అనిల్ చంద్రకాంత్, రఘు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ అభినందనీయం



నాగోలు: వేసవిలో ప్రజల దాహం తీర్చడం కోసం మజ్జిగ పంపిణీ అభినందనీయమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. జిల్లా నాయకురాలు కాటా విజయ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్ కుమార్, జంగారెడ్డి, సాయినాథ్ గౌడ్, వైజయంతి, స్వర్ణ, రామకృష్ణ, రాకేష్ యాదవ్, సంగ్రామ్, సురేందర్ చారి, రింకు, చందు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాగోలు: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తట్టిఅన్నారం, ఆర్‌కేనగర్‌కు చెందిన గాదె రవి(42) ఆటో డ్రైవర్. భార్య చంద్రకళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి మద్యానికి బానిసయ్యాడు. గురువారం చంద్రకళ పనికి వెళ్లగా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన భర్త మద్యంమత్తులో ఉరేసుకుని ఉండొచ్చని చంద్రకళ ఫిర్యాదు చేసింది.

విద్యార్థులకు కష్టపడే తత్వం అవసరం



వేడుకలను ప్రారంభిస్తున్న మోలుగరం కుమార్, అవంతి శ్రీనివాస్

నాగోలు: విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే డిగ్రీ, పీజీలతోనే ఉద్యోగాలు కష్టమని నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మోలుగరం కుమార్ అన్నారు. గురువారం నిర్వహించిన అవంతి డిగ్రీ, పీజీ విద్యా సంస్థల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు కష్టపడే తత్వం చాలా అవసరమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అవంతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ వ్యవస్థాపకులు అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏ డిగ్రీ కోర్స్ చదివినా నైపుణ్యం ఉంటే ఏ వృత్తిలోనైనా రాణించగలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సీఈవో శ్రీకాంత్ సిన్హా, బ్రహ్మకుమారి అంజిలి, చార్టెడ్ అకౌంటెంట్ చైర్మన్ చిన్న సీతారామిరెడ్డి, విద్యా సంస్థల జనరల్ సెక్రెటరీ ప్రియాంక పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కార్పొరేటర్

సైదాబాద్: శ్రీరామనవమి ఉత్సవాలకు ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు కల్పిస్తున్నామని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆమె సైదాబాద్‌లోని పలు కాలనీలు, బస్తీల్లోని ఆలయాల వద్ద ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. శ్రీరామన నవమి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే శ్రీరామ కల్యాణం, రథోత్సవాలు నిర్వహించే ఆలయాల పరిసరాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్పొరేటర్ వెంట సుధీర్‌రెడ్డి, ప్రవీణ్, మల్లేష్, శశికాంత్, సంధ్య పాల్గొన్నారు.

'మార్కెట్' ఆదాయం రూ. 15.22 కోట్లు



మల్లేశం

చాదర్‌ఘాట్: హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ. 15.22 కోట్లు ఆదాయం సమకూరిందని హైదరాబాద్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ మార్కెటింగ్ అధికారి మల్లేశం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది కన్నా ఈ సారి రూ. 3 కోట్లు అధికంగా టార్గెట్ పెట్టినప్పటికి ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఫీజుల రూపంలో రూ. 15.22 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం రాకుండా, వారికి గిట్టుబాటు ధర కల్పిస్తూనే ఆదాయాన్ని కూడా సమకూర్చినట్లు వివరించారు. హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కింద మలక్‌పేట, మాదన్నపేట, ఉస్మాన్‌గంజ్, మిరాలంమండి మార్కెట్లు ఉండగా మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో జరిగే ఉల్లిగడ్డ, మిర్చి క్రయవిక్రయాల ద్వారానే అధిక ఆదాయం వస్తుందన్నారు. టార్గెట్ పూర్తి చేయడంలో మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్–1 కార్యదర్శి చిలుక నర్సంహారెడ్డి, మార్కెట్ అధికారులు, సిబ్బంది కృషి చేశారన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

మన్సూరాబాద్: తెలంగాణ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఎల్‌బీనగర్‌లో గురువారం నిర్వహించారు. కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సత్తయ్య, శ్రీను, శంకర్, శ్రీకాంత్, స్వామి, శ్రీను, కృష్ణ, సత్యం, యాదగిరి పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి..

మన్సూరాబాద్: ఛత్రపతి శివాజీ వర్ధంతిని మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని శివాజీనగర్ చౌరస్తా వద్ద నిర్వహించారు. బీజేవైఎం నేతలు సాయిరామ్‌గౌడ్, జయతేజ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో యాదగిరియాదవ్, కొండల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సోమనాథ్, కోటయ్య, మోహన్‌రెడ్డి, సంపత్‌గౌడ్ వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, నరేష్, రఘురాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



బీజేపీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

నాగోలు: బీజేపీ పిలుపు మేరకు ఛలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నేపథ్యంలో గురువారం నాగోలు పోలీసులు పంగా శ్రీకాంత్, సిద్దాల ఐలయ్య, పాల్వాయి సంజీవరెడ్డిను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. గచ్చిబౌలిలోని హెచ్‌సీయులోని 400 ఎకరాల భూమిని అమ్మి వచ్చిన డబ్బులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల వెల్లదీస్తావు అని విమర్శించారు. కాంక్రీట్ జంగిల్ అయిన నగరంలో పచ్చని చెట్లు, వన్యప్రాణులు నివాసాలను కూల్చి ఆక్సిజన్ కూడా అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి సాకుతో కమీషన్ల కోసం ప్రభుత్వ భూములు అమ్ముకోవడం దారుణమన్నారు. పాలన చేతగాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



మన్సూరాబాద్: అభివృద్ధి పనుల్లో ఎన్ని అడ్డుంకులు సృష్టించినా ట్రంక్‌లైన్ ఔట్‌లైన్ పనులను పూర్తి చేయిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. స్వాతిరెసిడెన్సీ వద్ద ట్రంక్‌లైన్ పనులు నిలిచిపోయాయని మన్సూరాబాద్ హయత్‌నగర్ పరిధిలోని కాలనీలవాసులు గురువారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ట్రంక్‌లైన్ వెళ్లేందుకు ప్రైవేటు స్థలంలో నుంచి వెళ్లాల్సి ఉండగా స్థలం యాజమానులతో చర్చించి స్థలం ఇచ్చేందుకు వారిని ఒప్పించడం జరిగిందని కొందరు నాయకులు సదరు స్థల యజమానిని కలిసి స్థలం ఇవ్వొద్దని బెదిరించారని తెలిపారు. మరోసారి స్థల యజమానులతో చర్చించి ట్రంక్‌లైన్ పనులు కొనసాగేలా చర్యలు చేపడుతానని, కాలనీవాసులు ఆందోళన చెందవద్దన్నారు. నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కిడి రఘువీర్‌రెడ్డి, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి పాతబస్తీ ప్రతీక



ఈద్ మిలాద్‌లో పాల్గొన్న కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: హిందూ ముస్లింలు సోదరభావంతో మెలిగే పాతబస్తీ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడు అఫ్రోజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈద్ మిలాద్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజ సమగ్రత ఐక్యతను సంరక్షించడానికి, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించటానికి ఇలాంటి ఈద్ మిలాద్ దోహదపడుతాయన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు ప్రబలుతున్న ఈ సమయంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభినయ్ కార్యక్రమం తీసుకురావడం దేశ సుస్థిరతకు ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రవిరాజ్, మామిడి కృష్ణకుమార్, గని, నజీర్ అహ్మద్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రొటోకాల్ పాటించడం లేదు'



వనస్థలిపురం: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అభివృద్ధి పనుల విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. గురువారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి గత పదేళ్లుగా రాని నిధులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే వచ్చాయన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జిల్లా ఇన్‌చార్జి మంత్రితోనే జరగాలని ఈ విషయమై మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడడం జరిగిందన్నారు. ఈ నెల 7న ఆయన నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని అన్నారు. హస్తినాపురం మహిళా కార్పొరేటర్‌పై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, సుజాతా నాయక్, నాయకులు కుట్ల నర్సింహాయాదవ్, నేలపాటి రామారావు, పాశం అశోక్‌గౌడ్, వజీర్ ప్రకాష్‌గౌడ్, స్వర్ణమాధవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న వరదనీటి కాలువ పనులను వర్షాకాలం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న వరదనీటి కాలువ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించి మాట్లాడారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న వరద కాలువల పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమతా మల్లేశ్‌గౌడ్ ఉన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వనస్థలిపురం: వనస్థలిపురం హిల్‌కాలనీలోని శ్రీ రాజ్యలక్ష్మీ గోదా సమేత శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 8 వరకు నిర్వహించే స్వామి వారి 27వ బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 108 కలశాలతో క్షీరాభిషేకం, లక్ష పుష్పార్చన, అంకురార్పణ తదితర పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మారావు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి డా.పి.పద్మనాభరావు, సహాయ కార్యదర్శులు పి.శ్రీధర్‌రావు, భవాని ప్రమోద్‌కుమార్, కార్యవర్గసభ్యులు టి.విజయకుమార్, పి.వెంకటనారాయణ, పి.సత్యనారాయణ, పి.విద్యాసాగర్‌రావు, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి వేంకటేశ్వరనగర్‌కాలనీలో గురువారం ఆయన పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు రూ.23 లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతామన్నారు. ఇంట్లోని చెత్తను రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని, తప్పనిసరిగా చెత్త ఆటోకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శివప్రసాద్, చందు, సత్యనారాయణ, రమేష్, చిన్నయ్య నాగేశ్వర్‌రావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

మలక్‌పేట: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పంజేషాలోని క్యాంపు కార్యాలయంలో గురువారం జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అభివృద్ధి పనుల నిర్వహణపై అధికారులతో చర్చించారు. మలక్‌పేటలోని డబుల్ బెడ్రూమ్ భవన సముదాయంలో మెరుగైన వసతుల కల్పన కోసం అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. మలక్‌పేట రైల్వే బ్రిడ్జి వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.